## మామిళ్లపల్లె విఆర్‌ఒపై చర్యలు తీసుకోవాలి

**కడప అర్బన్ :** ఇందిరానగర్‌లో తమకు అలిమిలి రాము, భాగ్యలక్ష్మి, ప్రసన్నకు కేటాయించిన స్థలం లో మేము ఇల్లులు నిర్మించుండగా మామిళ్లపల్లె వీఆర్వో వెంకటరమణ అడ్డుపడుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని స్వర్ణలత, నిర్మల ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం వారు మీడియాతో మాట్లాడుతూ మాసాపేట నివసిస్తున్న తాము చింతకొమ్మదిన్నె మండలం మామిళ్ళపల్లి గ్రామం ఇందిరానగర్‌లో సర్వేనెంబర్ 731, 732 పైకి 2012 సంవత్సరంలో తహశీల్దార్ ఇంటి పట్టాలను మంజూరు చేశారని తెలిపారు. ఆ స్థలంలో గోడలు నిర్మించుకుంటే విఆర్ఒ, మరికొంత మంది నిర్మాణంలో ఉన్న ఇంటిని కూలగొట్టాలని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకుపోయామని చెప్పారు. అయినా వారి ఆగడాలకు అంతులేకుండా పోయాయని వాపోయారు. తమ స్థలంలో ఇల్లు నిర్మించు కోకుండా అడ్డుపడుతున్న వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

# ట'మోత'

**టమోటా ధరలు ఒక్కసారిగా ఆకాశాన్నంటుతున్నాయి. సామాన్యునికి నిత్య అవసర సరుకుగా వినియోగించే టమోటా ప్రస్తుతం పేదవాని కంచంలోకి చేరడానికి ససేమిరా అంటోంది. అందుకు పెరిగిన కూరగాయల ధరలే ఇందుకు ప్రధానంగా కనిపిస్తోంది. పంటలు దెబ్బతినడంతో పంట సాగు తగ్గి దిగుబడి తీవ్ర స్థాయిలో క్షీణించింది. ఒక్కసారిగా డిమాండ్ పెరగడంతో టమోటా ధర ఒక్కసారిగా ఏకంగా కిలో రూ.50కిపైగా చేరింది. సామాన్యుని మెనూలో టమోటా అడ్రస్ గల్లంతు అవుతున్న పరిస్థితి ప్రస్తుతం జిల్లాలో కనిపిస్తోంది.**

- టమోట ధరలకు రెక్కలు
- కిలో రూ.50కి చేరిన వైనం
- తగ్గిన పంట సాగే కారణం
- రైతులకు ఊరడింపు
- ఇబ్బందుల్లో సామాన్య జనం

ప్రజాశక్తి-మదనపల్లె

పేదవాడి నుంచి పెద్దోళ్ల వరకు తీసుకునే ఆహారంలో టమోటా నిత్యావసర సరుకుగా ఉంది. ప్రధానంగా సామాన్యుడు తినే పప్పుచారు నుంచి దాదాపు అన్ని రకాల వంటల్లో దీని వినియోగం అధికంగా ఉంది. సామాన్యుని పోషకాలు అందించే కూరగాయాల్లో అత్యంత అందుబాటులో ఉన్న కూరగాయల్లో టమోటా ముందు వరుసలో నిలుస్తుందనడంలో ఎలాంటి సందేహమూ లేదు. నిత్యం అందుబాటులో ఉండే టమోటా ధర ఒక్కసారిగా పెరిగింది. పెరిగిన ఈ ధరలు ప్రస్తుతం సామాన్యున్ని ఠారెత్తిస్తోంది. పది రోజుల కిందట కిలో రూ.10 ఉన్న ఈ సరుకు ఒక్కకసారిగా రూ.50కిపైగా చేరడంతో వినియోగదారుల గుండెలు గుబేలుమంటున్నాయి. ఒక్కో రోజు ఒక్కో రేటు ఉంటోంది. రూ.50కి పైమాటే కానీ దిగిరావడం లేదు. ఒకింత సామాన్యులకు ఇది భారమే అయినప్పటికీ మరోవైపు పంట సాగుచేసే రైతుకు ఒకింత ఊరటనిచ్చింది.

జిల్లాలోని మదనపల్లి, గుర్రంకొండ, చిన్నమండెం, బి.కొత్తకోట, రామసముద్రం, తంబళ్లపల్లె, వాల్మీకిపురం, పెద్దతిప్పసముద్రం, కురబలకోట, తదితర మండలాల్లో ప్రధాన పంటగా సాగవుతోంది. దిగుబడి బాగా తగ్గిపోవడంతో టమోటాకు డిమాండ్ పెరిగింది. ప్రధానంగా టమోటా పంట సాగు రైతుకు ప్రస్తుతం కర్రమీద సాములా తయారైంది. దీనికి ప్రధానంగా సాగునీటితో పాటు అధిక ఉష్ణోగ్రతలే ప్రధానంగా కనిపిస్తోంది. ఈ ఏడాది ఎన్నడు లేని విధంగా ఉష్ణోగ్రతలు అత్యధికంగా నమోదవుతున్నాయి. పంట అధిక ఉష్ణోగ్రతల దాటికి తట్టుకోలేకపోతోంది. భూగర్భజలాలు కూడా తీవ్ర స్థాయిలో పడిపోతుండడంతో పంటల సాగు ఇబ్బందికరంగా మారుతోంది. పంట దిగుబడి కూడా సగానికి సగం పడిపోయినట్లు తెలుస్తోంది. పంట దిగుబడి తగ్గడం కారణంగా ధర ఒక్కసారిగా ఆకాశాన్నంటింది.

### రైతుకు ఊరట

రైతుల పండించే టమోటాకు ఒక్కసారిగా ధర పెరగడంతో రైతు కళ్లలో కాంతులు కనిపించాయి. ప్రధానంగా పెరిగిన ఈ ధరలు ఒకరకంగా ఓ రకంగా సామాన్యులకు భారంగా మారినప్పటికీ మరోవైపు సాగుచేసిన రైతులకు ఇది మంచి ఊరట నిచ్చిందనడంలో ఎలాంటి సందేహమూ లేదు. కాగా పంటంతా దెబ్బతిన్న తరుణంలో ఈ విదమైన ధరలు పలకడం ఒకింత రైతులను నిరాశకల్గిస్తోంది. పంట దిగుబడి బాగున్నప్పుడు ఈ ధర పలికింటే తమ కష్టాలన్నీ తీరేవని నిరాశను వ్యక్తం చేయడం గమనార్హం.

### కొనలేం.. తినలేం

నిత్యావసర సరుకుగా ఉన్న టమోటా ధర ఒక్కసారిగా పెరిగింది. దీనితో రోజువారి తినే ఆహారంలో టమోటాను చేర్చుకోవడం కష్టంగా మారింది. కిలో రూ.60కి పెరగడంతో కొనలేని,తినలేని పరిస్థితి దాపురించింది. పెరిగిన ధరలను తగ్గించాలి.

**- సుబ్బమ్మ, గృహిణి.**

### దిగుబడి తగ్గింది

టమోటా దిగుబడి తగ్గడం వల్లనే ధరలు పెరుగుతున్నాయి. రైతులు ఎంతో లబ్ధి పొందుతున్నారు. టమోటా దిగుబడి తగ్గి ధరలు పెరిగాయి. మహారాష్ట్రలో మోటాలు దిగుబడి పెరిగి ఆ టమోటాలు హైదరాబాదు మార్కెట్‌కు వస్తున్నాయి. అక్కడి నుండి టమోటా దిగుమతి తగ్గితే ధరలు ఇంకా పెరిగే అవకాశం ఉంది. మదనపల్లి మార్కెట్ యార్డ్ నుండి మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, చండీగర్, ఆగ్రా రాష్ట్రాలకు ఎగుమతి అవుతున్నాయి.

**- అభిలాష్, మార్కెట్ యార్డ్ కార్యదర్శి, మదనపల్లె.**

# పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

## - కలెక్టర్ విజయ్‌రామరాజు

ప్రజాశక్తి-కడప అర్బన్

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని కలెక్టర్ విజయ్‌రామరాజు పేర్కొన్నారు. బుధవారం కోటిరెడ్డి ప్రభుత్వ మహిళా కళాశాలలో ఎన్ఎస్ఎస్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కలెక్టర్ విజయరామరాజు, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ సెక్రటరీ ఎస్. బాబా ఫక్రుద్దీన్, మున్సిపల్ కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్, ఆర్‌డిఒ హాజర య్యారు. కళాశాల ఆవరణంలో మొక్కను నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి పౌరుడు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. ప్రకృతి పరిరక్షణ కోసం అందరూ మొక్కలను నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.సలీం బాషా, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ జి. విజయలక్ష్మి దేవి, డాక్టర్ పి.సచిదేవి, డాక్టర్ పి. సుబ్రహ్మణ్యం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. **వైవీయూలో..** రేపటి తరానికి అందమైన ఆరోగ్యకరమైన వాతావరణం అందించాలంటే పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యతగా భావించాలని యోగి వేమన యూనివర్సిటీ విసి ప్రొఫెసర్ చింతా సుధాకర్ అన్నారు. పర్యావరణ పరిరక్షణ నినాదాల ప్లకార్డులు ప్రదర్శించారు. విసి చింతా సుధాకర్, ప్రిన్సిపల్ ఎస్.రఘునాథరెడ్డి, విశ్వవిద్యాలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ భూమి, నీరు,గాలి ఉండాలంటే ప్రజల అలవాట్లలో, ఆలోచనల్లో మార్పులు రావాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో– ఆర్డినేటర్ డాక్టర్ ఎన్.వి.రామిరెడ్డి, ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ ఎస్. పి. వెంకటరమణ, పర్యావరణ విభాగ సహాఆచార్యులు డాక్టర్ టి. చంద్రశేఖర్, డాక్టర్. శ్రీధరరెడ్డి, పరిక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసర్ ఎన్. ఈశ్వర్ రెడ్డి, వృక్షశాస్త్ర విభాగం అధ్యాపకులు డా. రాజగోపాల్ రెడ్డి, పరిశోధన విద్యార్థులు, వివిధ శాఖల సహాయక సిబ్బంది పాల్గొన్నారు. **ఇంటాక్ ఆధ్వర్యంలో..** పర్యావరణాన్ని రక్షించినపుడే భూమిపై మానవాళి జీవనం సాధ్యమవుతుందని భారత జాతీయ కళా సంస్కృతి వారసత్వ పరిరక్షణ సంస్థ (ఇంటాక్) జిల్లా కన్వీనర్ లయన్ కె.చిన్నపరెడ్డి అన్నారు. స్థానిక మానస ఇన్ సమావేశ మందిరంలో చిన్నపరెడ్డి పర్యావరణంపై ప్రత్యేకంగా ప్రచురించిన రెండు రకాల బ్రోచర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో ఇంటాక్ సంస్థ సీనియర్ సభ్యులు లయన్ కె.సంజీవరెడ్డి, న్యాయవాది భారవి, సభ్యులు రాఘవేంద్రవర్మ పాల్గొన్నారు. **వేంపల్లె :** కాలుష్యాన్ని నివారించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలను విరివిగా నాటాలని ఐసిడిఎస్ సిడిపిఓ సునీత సూచించారు. స్థానిక క్రిష్టియన్ కాలనీలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా బుధవారం ఐసిడిఎస్ వేంపల్లె శాఖ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. క్రిష్టియన్ కాలనీలో ఐసిడిఎస్ సిడిపిఓ సునీత మొక్కలు నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణంలోని గాలి, ధ్వని, వ్యర్ధ పదార్థాలతో మనం నివసిస్తున్న భూమి కలుషితం అవు తోందన్నారు. ఈ నేపథ్యంలో ప్రకృతి సమతుల్యం దెబ్బతిని వాతావరణంలో మార్పులు వస్తున్నాయన్నారు. వాతావరణం మార్పులు వల్ల ప్రజల ఇబ్బం దులు తొలగాలంటే వృక్షాలు అవసరమన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి పర్యావరణాన్ని కాపాడాలని కోరారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వర్ణలత, అంగన్వాడీ కార్యకర్త రమ, అంగన్వాడీ సహాయకురాలు వెంకటసుబ్బమ్మ, ఆరోగ్య కార్యకర్త లక్ష్మిదేవి, ఆశ కార్యకర్త మాలిని, ఎంఎల్‌హెచ్‌పి రాణి, డ్వాక్రా మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు. **విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు ..** కడపలో నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో వేంపల్లెకు చెందిన ప్రభుత్వ బాలుర పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటినట్లు పాఠశాల హెచ్‌ఎం శివ మునెమ్మ, డ్రాయింగ్ మాస్టర్ సురేష్‌కుమార్ తెలిపారు. బుధవారం పర్యావరణం దినోత్సవం సందర్భంగా కడప నగరంలో పర్యావరణ మిత్ర సమూహం సొసైటీ ఆధ్వర్యంలో చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను జిల్లా విద్యాశాఖ అధికారి అనురాధ అభినందించారు. జిల్లా స్థాయిలో శివ నరసింహ రెండవ బహుమతి సాధించగా, ధనుంజయ్ అనే విద్యార్థి మూడవ స్థానంలో నిలిచారన్నారు. వీరికి సర్టిఫికెట్లుతోపాటు నగదును కూడా అందించినట్లు చెప్పారు. **పులివెందుల రూరల్ :** పట్టణంలోని 'ఆహార విజ్ఞాన శాస్త్ర, సాంకేతిక కళాశాల'లో బుధవారం 'ప్రపంచ పర్యావరణ దినోత్సవం' కార్యక్రమం నిర్వహించారు. అసోసియేట్ డీన్ డాక్టర్ ఎమ్ఎస్ బేగ్ మాట్లాడుతూ వేగవంతమైన భూమి పునరుద్ధరణ, కరువును తట్టుకునే శక్తి, ఎడారీకరణ నియంత్రణ అనే నేపథ్యం మీద ఈ సంవత్సరం ప్రపంచ పర్యావరణ దినోత్సవం జరుపుకుంటున్నామని తెలిపారు. స్టూడెంట్ ఆక్టివిటీ అధికారి డాక్టర్ రాజేష్ మాట్లాడుతూ ఎవరో వస్తారు, ఏదో చేస్తారని ఎదురు చూస్తూ ఉండకుండా, మన పరిసరాలను మనమే శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కళాశాల జాతీయ సేవాపథకం అధికారి డాక్టర్ నివేదిత పర్యావరణ ప్రాముఖ్యత గురించి వివరించారు. విద్యార్థులచే పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అధ్యాపకులు అరుణ, డాక్టర్ కీర్తిరెడ్డి, డాక్టర్ జయమ్మ, డాక్టర్ సాయి శ్రీనివాస్, డాక్టర్ రాజశేఖర్, ఎన్‌వి సుబ్బారెడ్డి, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు **ప్రొద్దుటూరు :** మానవ తప్పిదాల వల్ల పర్యావరణం కలుషితమై ప్రమాదంగా మారుతోందని సైన్స్ కాంగ్రెస్ జిల్లా కో–ఆర్డినేటర్ డి.వి. సుబ్బరాయుడు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక జనవిజ్ఞానవేదిక (జెవివి) కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి (ఆప్‌కాస్ట్)ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. జెవివి రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి మురళీధర్ మాట్లాడుతూ భూగోళాన్ని హరితం చేయడానికి వృక్ష సంపదను పెంచి సమాజానికి హితవును చేకూర్చాలన్నారు. జెవివి జిల్లా అధ్యక్షులు శ్రీరాములు మాట్లాడుతూ విద్యార్థులు పరిసరాల పరిశుభ్రతను పాటించడంతోపాటు ప్లాస్టిక్ వినియోగాన్ని బాగా అరికట్టాలన్నారు. జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి బాలబయన్న, జెవివి పట్టణ ప్రధాన కార్యదర్శి సునీత మాట్లాడారు. అనంతరం చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వ పోటీలలో విజేతలైన విద్యార్థులకు బహుమతులు, ప్రశంశాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కో–ఆర్డినేటర్లు అక్షయ హాసిని, భరత్, వెంకట భరత్, అంజి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు

మొక్కకు నీళ్లు పోస్తున్న కలెక్టర్ విజయ్‌రామరాజు

# విద్యారంగ పరిరక్షణకు నూతన ప్రభుత్వం కృషి చేయాలి

## - యుటియఫ్ జిల్లా అధ్యక్షులు మాదన విజయకుమార్

ప్రజాశక్తి - బద్వేలు

గత ప్రభుత్వం సంస్కరణల పేరుతో ప్రభుత్వ విద్యారంగంలో చేపట్టిన మార్పుల వల్ల కలిగిన నష్టాలను సరిదిద్ది రాష్ట్రంలో ఏర్పడబోతున్న నూతన ప్రభుత్వం, ప్రభుత్వ విద్యావ్యవస్థను బలోపేతం చేయాలని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటియఫ్) కడప జిల్లా అధ్యక్షులు మాదన విజయ కుమార్ కోరారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జరిగిన ఎన్నికల్లో ప్రజాభీష్టం మేరకు నూతనంగా ఎన్నికైన ప్రభుత్వానికి యుటియఫ్ పక్షాన ఆయన అభినందనలు తెలియజేశారు. నూతనంగా ఏర్పడబోతున్న ఈ ప్రభుత్వం జూన్ 9న ప్రమాణస్వీకారం చేసే సందర్భంలో రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని సరిదిద్దే చర్యలు ప్రకటించాలని కోరారు. వాటిలో ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ ప్రకారం మెగా డిఎస్‌సి ప్రకటిస్తూ మొదటి సంతకం చేయాలని ఆయన కోరారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 28వేల ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలను భర్తీ చేసే విధంగా మెగా డిఎస్‌సి ప్రకటించాలని, జిఒ 117ను రద్దు చేస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు. జిఒ 117 కారణంగా రాష్ట్రంలో 13వేల పాఠశాలలు సింగిల్ టీచర్ స్కూల్స్‌గా మారిపోయినందున విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రతి ప్రాథమిక పాఠశాలలో కనీసం ఇద్దరు ఉపాధ్యాయులు ఉండేలా, ప్రతి ఉన్నత పాఠశాలలో తగినంతమంది సబ్జెక్టు టీచర్లు ఉండేవిధంగా తగు చర్యలు తీసుకొని నిర్ణయం ప్రకటించాలన్నారు. ఈ హామీలతో పాటు రాష్ట్రంలో విద్యార్థులు తమకు నచ్చిన మీడియంలో చదువుకునేలా అన్ని పాఠశాలల్లో తెలుగు, ఇంగ్లీషు మీడియంలు రెండింటిని కొనసాగించాలని చెప్పారు. ప్రాథమిక పాఠశాలలను రెండుగా విభజించిన కారణంగా ఇటీవల ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్రోల్మెంట్ బాగా తగ్గిపోయిందని, విద్యార్థులు, తలిదండ్రులు కూడా పలు ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. కాబట్టి 1 నుండి 5 తరగతులను ఒకే పాఠశాలగా నిర్వహించేందుకు తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి గ్రామంలో తరగతికి ఒక ఉపాధ్యాయుడు, అన్ని సౌకర్యాలు కలిగిన ఒక మంచి పాఠశాల ఏర్పాటు చేయాలన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులు మూడు రకాల సిలబస్ లలో ఏదో ఒక దానిని ఎంచుకోవాల్సి వస్తుందని, దీన్ని సమీక్షించి రాష్ట్రమంతటా ఒకే సిలబస్ ఉండే విధంగా తగు చర్యలు చేపట్టాలని కోరారు. ఈ అంశాలను సరిదిద్దడం ద్వారా ప్రభుత్వ విద్యారంగం బలోపేతానికి నూతన ప్రభుత్వం కృషి చేయాలని, ప్రభుత్వ పాఠశాలలపై తలిదండ్రులకు విశ్వాసం కలిగించేలా నూతన ప్రభుత్వం వ్యవహరించాలని ఆయన కోరారు.

మాట్లాడుతున్న విజయ్‌కుమార్

## వైసిపికి రాజకీయ సమాధి కట్టారు

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారాన్ని చేపట్టిన నాటి నుంచి ల్యాండ్, శాండ్, మైన్, వైన్ మాఫియాను పెంచి పోషిస్తూ ప్రభుత్వ ఆదాయాన్ని కొల్లగొట్టి వ్యక్తిగత ఆస్తులు పెంచుకుంటూ, పెత్తందారి మనస్తత్వంతో విర్రవీగిన జగన్ సర్కార్‌ను చిత్తుగా ఓడించి ప్రజలు రాజకీయ సమాధి కట్టారని, మతతత్వ బిజెపి సీట్లు తగ్గించి దేశ ప్రజలు కట్టడి చేశారని సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర అన్నారు. బుధవారం సిపిఐ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రజల సమస్యలు పరిష్కరించి, సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తారని, అధిక సంఖ్యలో అసెంబ్లీ, పార్లమెంటు స్థానాలు కట్టబెడితే ఐదు సంవత్సరాల జగన్ పాలనలో రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో దాటవేత వైఖరి అవలంభించారని తెలిపారు. అధిక మొత్తంలో ప్రజలపై పన్నులు వేసి తిరిగి వారి అకౌంట్లో డబ్బులు వేయడానికి షరతులు పెట్టి కుటుంబంలో ఒకరికి ఎగరగొట్టి ఇబ్బంది పెట్టడమే అభివృద్ధి అంటూ పేటీఎం బ్యాచ్ ద్వారా ప్రచారాన్ని ఊదర కొట్టారని విమర్శించారు. అత్యధిక స్థానాలు కైవసం చేసుకున్న టిడిపి అవసరం కేంద్రంలో 240 స్థానాలకే పరిమితమైన బిజెపి ఉందన్నారు. అదే ఇండియా కూటమితే కలిస్తే రాష్ట్రానికి వ్యతిరేకమైన చర్యలకు పూనుకోవడమే కాకుండా చంద్రబాబును జైల్లో పెట్టించిన బిజెపికి తగిన బుద్ధి చెప్పినట్లవుతుందని పేర్కొన్నారు. ఇండియా కూటమి అధికారంలోకి రాగానే రాష్ట్రానికి ప్రత్యేక హోదా, రాయలసీమ ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ, పోలవరం పూర్తికి నిధులు, రాజధాని నిర్మాణం, కడప ఉక్కు పరిశ్రమ నిర్మాణం తోపాటు దేశ సమైక్యత, సమగ్రతకు దోహద పడుతుందన్నారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పి.చంద్రశేఖర్, జి.వేణుగోపాల్, కెసి బాదుల్లా పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌కు శుభసూచకం

**కడప :** వై.ఎస్.షర్మిలరెడ్డి నేతృత్వంలో అనూహ్యంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో పుంజుకుందని, ఇది శుభ సూచకమని కడప యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు మధు రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. షర్మిల తక్కువ సమయంలో చివరి నిమిషంలో పోటీకి దిగినా, తనదైన ముద్ర వేసుకున్నారని చెప్పారు. ఆంధ్ర ప్రదేశ్ ఎన్నికల ఫలితాల్లో వైఎస్ షర్మిల రెడ్డి నాయకత్వంలో ఆంధ్ర ప్రదేశ్ కాంగ్రెస్ మళ్ళీ తనలో జవసత్వాలు నింపుకొని, సమీప భవిష్యత్తులో మరింత శక్తి మంతంగా రూపుదిద్దుకుంటుందని చెప్పారు. రాష్ట్ర విభజన తర్వాత ఎపిలో రూపురేఖలు కోల్పోయి, ఉనికి కూడ లేని కాంగ్రెస్‌లో కొత్త ఉత్సాహం నింపారన్నారు. అతితక్కువ కాలంలోనే కార్యకర్తలతో తిరిగి వారిలో మనోధైర్యం, నమ్మకం తిరిగి పెంపొందించుకోవటంలో షర్మిల తీవ్ర కృషి చేశారని అన్నారు. దీని ఫలితమే కడప పార్లమెంటు పోటీలో ఓడిపోయినా కూడా దాదాపు 11 శాతం ఓటు షేరు సంపాదించారని చెప్పారు. అటు జగన్ ప్రాబల్యంలోని పులివెందులలో, ఇటు కడప, రెంటిలోనూ షర్మిల మంచి పోటీ ఇచ్చారు అని తెలిపారు.

## జగన్ ఆత్మావలోకనం చేసుకోవాలి

### - మాజీ ఎమ్మెల్సీ రామచంద్రయ్య

ప్రజాశక్తి-కడప అర్బన్

దేశ చరిత్రలో టిడిపి కూటమికి ఇంత పెద్ద మెజార్టీ ఇవ్వడం ఆశ్చర్యంగా ఉందని ఆ పార్టీ నేత. మాజీ ఎమ్మెల్సీ సి. రామచంద్రయ్య అన్నారు. బుధవారం ఎన్జీవో కాలనీలోని ఆయన నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫలితాలను చూసి జగన్మోహన్ రెడ్డి ఆత్మావలోకనం చేసుకోవాలని తెలిపారు. విచ్చలవిడిగా దోపిడీ చేశారని పేర్కొన్నారు. మైనింగ్ వ్యవస్థను భ్రష్టు పట్టించారని చెప్పారు. ప్రజలను పూర్తిగా విస్మరించిన జగన్ బహిరంగ క్షమాపణ చెప్పాలని తెలిపారు. ప్రజలపై నిందెలు వేయడం సరికాదని పేర్కొన్నారు. కులాలను సైతం దూరం చేసుకున్నారని విమర్శించారు. ఏ రాజకీయ పార్టీకి ఇంత మాండెటరీ ఇవ్వలేదని తెలిపారు. తప్పు చేసి ప్రజలను నిందించడం ఏమిటని ప్రశ్నించారు. జగన్ నీవల్ల కడప జిల్లా వాసులుగా సిగ్గుతో తల దించుకుంటున్నామని పేర్కొన్నారు. అప్పుడు, ఇప్పుడు ప్రజా ధనాన్నే పథకాల రూపంలో ఇస్తున్నారని చెప్పారు. కానీ సంక్షేమ పథకాల అమలులో రామారావును అందరించారని తెలిపారు. రాజధాని లేని రాష్ట్రం చేశారని పేర్కొన్నారు. కొందరు మంత్రులు రాష్టాన్ని దోచేశారని చెప్పారు. నీతిమంతమైనా అధికారులను అవినీతి పరలుగా మార్చేశారని చెప్పారు. ప్రజలంతా ఒకే అభిప్రాయంతో ఓటేశారని పేర్కొన్నారు. దోపిడీ జరిగిందని ఫిర్యాదు చేస్తే ఫిర్యాదారుడిపైనే కేసులు పెట్టారని చెప్పారు. ఆస్తులు పెంచుకోవడం కోసం పెద్ద ఎత్తున జగన్ డ్యూటీ చేశారని తెలిపారు. మినీ ప్యాలెస్ నిర్మించుకున్నారని పేర్కొన్నారు. ప్రజలు వైసిపి చెంపపెట్టు లాంటి తీర్పు ఇచ్చారని చెప్పారు.

మాట్లాడుతున్న రామచంద్రయ్య

## ఇది ప్రజా విజయం

**కడప అర్బన్ :** వైసిపి ప్రభుత్వం అవలంభించిన ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ప్రజలు విసిగి వేసారి టిడిపి కూటమికి విజయం అందించారని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు అమీర్ బాబు అన్నారు. బుధవారం ఎన్జీవో కాలనీలోనే ఆయన స్వగృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అమీర్ బాబు మాట్లాడుతూ ఈ రాష్ట్రానికి రాజధాని రావాలని, పోలవరాన్ని నిర్మించాలని, నిత్యావసర సరుకుల ధరలను విప రీతంగా పెంచినందుకు ప్రతి విషయంలోనూ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో తిరుగులేని నాయకుడు చంద్రబాబు నాయుడును అన్నారు. జిల్లాలోని తెలుగుదేశం పార్టీ కూటమి అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో కడప నగర ప్రధాన కార్యదర్శి జలతోటి జయకుమార్, ఎన్నారై కువైట్ తెలుగుదేశం పార్టీ వైస్ ప్రెసిడెంట్ రహమతుల్లా, తెలుగు యువత నగర మాజీ అధ్యక్షులు మేకల వెంకటేష్ యాదవ్, సుబ్బరాయుడు, ఖాదర్ బాషా పాల్గొన్నారు

## కూటమి విజయం చారిత్రాత్మకం : 'చమర్తి'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

టిడిపి, జనసేన, బిజెపి కూటమి విజయం చారిత్రాత్మకమని టిడిపి రాజంపేట పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి జగన్మోహన్‌రాజు అన్నారు. బుధవారం రాజంపేట టిడిపి పార్లమెంటు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాడు కాంగ్రెస్ అధినేత్రి ఇందిరాగాంధీ అహంకారానికి ఆంధ్రుల ఆత్మగౌరవం అనే నినాదంతో స్వర్గీయ నందమూరి తారక రామారావు తెలుగుదేశం పార్టీని రాష్ట్రంలో ఎలాగైతే చారిత్రాత్మక విజయాన్ని అందించారో అదే బాటలో నేడు జగన్మోహన్‌రెడ్డి అహంకారపూరిత, నియంత పాలనకు చరమగీతం పాడుతూ నారా చంద్రబాబునాయుడు సారధ్యంలో ఎన్‌డిఎ కూటమి చారిత్రాత్మక విజయాన్ని అందుతుందని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో అహంకార పూరిత రాజకీయాలు మనుగడ సాగించలేవన్నారు. ఇందుకు నిదర్శనమే ఈ ఎన్నికల ఫలితాలని తెలిపారు. జగన్మోహన్‌రెడ్డి నిరంకుశ వాదం వలన అదుపుతప్పిన రాష్ట్ర పాలనను గాడిలో పెట్టి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్రాన్ని అభివ ృద్ధి బాటలో నడిపిస్తామని అన్నారు. తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ బాబు చేపట్టిన యువగళం పాదయాత్ర ప్రభావం ఈ ఎన్నికలలో ప్రధాన పాత్ర పోషించిందని తెలిపారు. చంద్రబాబు అక్రమ అరెస్టు సమయంలో తెలుగుదేశం పార్టీకి, బాబుకు, లోకేష్‌కు అండగా నిలబడి ఎన్‌డిఎ కూటమి ఏర్పాటులో ప్రధాన పాత్ర పోషించి కూటమి అఖండ మెజారిటీకి పాటుపడిన జనసేనాని పవన్ కల్యాణ్‌కు ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. రాజంపేట నియోజకవర్గంలో చోటు చేసుకున్న చిన్న చిన్న పొరబాట్లను సరిదిద్దుకొని వచ్చే ఎన్నికలకు నియోజకవర్గాన్ని బలోపేతం చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఒక్క అడుగు కబ్జా చేసినా తోలుతీస్తా : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ :

మదనపల్లెలో ఒక్క అడుగు కబ్జా చేసిన తోలు తీస్తానని ఎమ్మెల్యే షాజహాన్ బాషా అన్నారు. బుధవారం అయన తన నివాసంలో మీడియాతో మాట్లాడుతూ నియోజకవర్గంలో వైసిపి నేతలు భయానక పరిస్థితులను తీసుకురావడంతో ప్రజలే వారిని సాగనంపారని పేర్కొన్నారు. నియోజకవర్గ అభి వృద్ధికి ప్రణాళిక బద్ధంగా ముందుకెళతానని, పట్టణంలో గంజాయి, భూ దందాలు, అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ మూడు రోజుల్లో అరికట్టేలా చర్యలు తీసుకుంటామన్నారు. భూ కబ్జాలకు పాల్పడితే ఎంతటి వారైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. పార్టీల కతీతంగా న్యాయం కోసం వచ్చేవారికి అండగా ఉంటా నన్నారు. గతంలో ఏడు మంది వైసిపి నేతలు అరాచకాలు సృష్టించినట్లు గుర్తించామని ఇకపై అలాంటి సెటిల్మెంట్ నేతల ఆటలు సాగనివ్వమని స్పష్టం చేశారు. ముఖ్యంగా గెలిపించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు.

మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా

## ప్రజల తీర్పును గౌరవిస్తాం : అంజాద్‌బాషా

ప్రజాశక్తి - కడప

ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తామని మాజీ ఉపముఖ్యమంత్రి అంజాద్‌బాషా అన్నారు. రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన ప్రభుత్వానికి ఈ సందర్భంగా ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. బుధవారం సాయంత్రం తన నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్పొరేటర్‌గా మొదలైన తన రాజకీయ ప్రయాణం రెండు సార్లు ఎమ్మెల్యేగా, డిప్యూటీ సిఎం వరకు అవకాశం ఇచ్చిన కడప ప్రజలకు రుణపడి ఉంటానని చెప్పారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ అనేక హామీలు నెరవేర్చారు అని అన్నారు. రాజకీయం అంటే ప్రజలకు సేవ చేయడం అని నిరూపించిన నాయకుడు వైఎస్ జగన్ అని తెలిపారు. ఇచ్చిన మాట తప్పకుండా నెరవేర్చడం అనేది నైతిక విలువలతో రాజకీయాలు చేయాలని చూపారు అన్నారు. ఇదే తమకు కూడా జగన్మోహన్ రెడ్డి తెలిపారు నేర్పారు అన్నారు. కోవిడ్ లాంటి కష్ట కాలంలోనూ పేద వాడికి అండగా నిలబడ్డాం అని చెప్పారు.అర్హత ప్రామాణికంగా తీసుకుని అవినీతి రహిత పాలన అందించామన్నారు. పోరాటాలు, ఉద్యమాలు వైసిపికి కొత్తేమి కాదన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి వైసిపి తరపున ప్రజలకు అండగా నిలుస్తామని చెప్పారు.

## ఇవిఎంలు ట్యాంపరింగ్ చేశారు

ప్రజాశక్తి - కడప

చంద్రబాబు నాయుడు ఇవిఎంలను ట్యాంపరింగ్ చేశారని కమలాపురం మాజీ ఎమ్మెల్యే పి రవీంద్రనాథ్ రెడ్డి అన్నారు. బుధవారం వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇవిఎంలను ట్యాంపరింగ్ చేసి చంద్రబాబు గెలిచారని అన్నారు. సింగపూర్‌లో కూర్చొని టెక్నికల్‌గా టాంపరింగ్ చేశారని ఆరోపించారు. బార్ కోడ్ ద్వారా ట్యాపరింగ్ చేసినట్లు తాము అనుమానిస్తున్నామన్నారు. త్వరలోనే దీనిపై క్లారిటీ వస్తుంది, చంద్రబాబు వ్యవస్థలను మేనేజ్ చేసి ఇదంతా నడిపించారని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ స్కామ్ జరిగింది, దీనిపై త్వరలోనే కోర్టుకు వెళ్తాం అని స్పష్టం చేశారు.

పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న టిడిపి నాయకులు

## టిడిపి విజయోత్సవ ర్యాలీ

**ప్రజాశక్తి - పులివెందుల టౌన్**

సార్వత్రిక ఎన్నికల్లో ఎన్‌డిఎ కూటమి విజయం సాధించడంతో బుధవారం పట్టణంలో టిడిపి నాయకులు విజయోత్సవ బైక్ ర్యాలీ నిర్వహించారు. మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ రాఘవరెడ్డి, మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో పట్టణ వీధుల్లో టిడిపి నాయకులు, కార్యకర్తలు బైకు ర్యాలీ నిర్వహించారు. బిజెపి జిల్లా అధ్యక్షుడు శశిభూషణ్‌రెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీ జరిగింది. బాణసంచా పేల్చుతూ ఈ విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు భాను ప్రకాష్, మహేశ్వర్‌రెడ్డి, శ్రీరాములు, హరిప్రసాద్, సుష్మ, రమణారెడ్డి, హరికృష్ణ పాల్గొన్నారు.

కేక్ కట్ చేస్తున్న మండల కన్వీనర్ రామమునిరెడ్డి

## టిడిపి శ్రేణుల సంబరాలు

**ప్రజాశక్తి - వేంపల్లె**

సాధారణ ఎన్నికల్లో టిడిపి విజయ ఢంకా మోగించడంతో బుధవారం స్థానిక శ్రీచైతన్య వీధిలో ఆ పార్టీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. టిడిపి నాయకుడు మహమ్మద్ ఇనాయతుల్లా ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పార్టీ మండల కన్వీనర్ రామమునిరెడ్డిచే ప్రజలకు, అభిమానులకు, కార్యకర్తలకు పంపిణీ చేశారు. ఆ ప్రాంత ప్రజలు రామమునిరెడ్డిని శాలువతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఊహించని రీతిలో టిడిపి అభ్యర్థులు ఎన్నికల్లో గెలుపొందారని తెలిపారు. టిడిపి పాలనలో ప్రజలకు మంచి రోజులు వస్తాయన్నారు. అర్హులైన వారందరికి ప్రభుత్వ పథకాలను మంజూరవుతాయని తెలిపారు. పార్టీలకు అతీతంగా పథకాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వెంకట శివతోపాటు పలువురు టిడిపి నేతలు పాల్గొన్నారు.

**చక్రాయపేట :** సాధారణ ఎన్నికల్లో టిడిపి విజయ ఢంకా మోగించడంతో గండి వీరాంజనేయ స్వామి దేవస్థానం ఆవరణలో ఆ పార్టీ నాయకులు బుధవారం 10,116 టెంకాయలను కొట్టారు. టిడిపి యవనేత సింగారెడ్డి రజనీ కాంత్‌రెడ్డి (సూరి) ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సింగారెడ్డి రఘునాథరెడ్డి, సింగారెడ్డి నరసింహారెడ్డి, జనసేన పులివెందుల తాలూకా కన్వీనర్ డాక్టర్ హరీష్, గండి దేవస్థానం మాజీ చైర్మన్ వెంకటస్వామి, కావలి భాస్కర్, టిడిపి నాయకులు బాలస్వామిరెడ్డి, జగన్నాథరెడ్డి, మహమ్మద్ షబ్బీర్ ఆయా గ్రామాల టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంజన్న సన్నిధిలో టిడిపి నాయకులు

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

**- ప్రిన్సిపల్ డాక్టర్ చెరసాల యోగాంజనేయులు**

**ప్రజాశక్తి - వేంపల్లె**

స్థానిక వైఎస్ఆర్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్ల పక్రియ ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చెరసాల యోగాంజనేయులు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ డిగ్రీ కళాశాలకు ప్రభుత్వం నూతన కోర్సును మంజూరు చేసిందన్నారు. 5 కోర్సులకు అదనంగా మరో నూతన కోర్సు బిఎస్సీ హానర్స్ బాటనీ 2024-25 విద్యా సంవత్సరం నుంచి విద్యార్థులకు అందుబాటులో ఉందన్నారు. ఇప్పటికే బిఎ, హానర్స్ హిస్టరీ, బీకాం హానర్స్ కంప్యూటర్ అప్లికేషన్స్, బిఎస్సీ హానర్స్ కంప్యూటర్ సైన్స్, మ్యాథ్స్, కెమిస్ట్రీ కోర్సులు ఉన్నట్లు చెప్పారు. కళాశాలలో 10 మంది పిహెచ్‌డి అధ్యాపకులతోపాటు 30ఏళ్ల అనుభవం బోధన సిబ్బంది ఉన్నారని తెలిపారు. కళాశాలలో ఎన్ఎస్ఎస్, స్పోర్ట్స్ అండ్ గేమ్స్, రెడ్ రిబ్బన్ క్లబ్, క్యాంపస్ డ్రైవ్‌తోపాటు ఆధునిక పద్ధతుల్లో బోధన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో విద్యార్థులకు సంపూర్ణ రక్షణ ఉంటుందన్నారు. తమ కళాశాల నుండి 150 మంది డిగ్రీ ఉత్తీర్ణులైన విద్యార్థులు కడప, బెంగళూరులోని ప్రముఖ కంపెనీలలో ఉద్యోగాలు చేస్తున్నట్లు తెలిపారు. ఇంటర్ పాస్ అయిన విద్యార్థులు కళాశాలలోని హెల్ప్ డెస్క్‌ను సంప్రదించి ఉచితంగా ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని వేంపల్లె మండలంతోపాటు ఆయా మండలాల్లో ఉన్న విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ కోరారు.

## నేడు గండి క్షేత్రంలో బహిరంగ వేలం

**ప్రజాశక్తి - చక్రాయపేట**

గండి క్షేత్రంలో పూలు విక్రయించుకొనుటకు, టోల్ గేట్ వసూలు చేసుకొనుటకు గురువారం బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్లు దేవస్థాన సహాయ కమిషనర్ అలవలపాటి ముకుందారెడ్డి, దేవస్థాన చైర్మన్ కావలి కృష్ణతేజ, తెలిపారు. జులై నెల ఒకటవ తేదీ నుండి 2025వ సంవత్సరం జూన్ 30వ తేదీ వరకు దేవస్థాన ఆవరణలో పూలు అమ్ముకొనుటకు, వాహనాలకు టోల్‌గేట్ వసూలు చేసుకొనుటకు రూ.5 లక్షలు డిపాజిట్ చెల్లించి వేలంపాటలో పాల్గొనవచ్చున్నారు. ముఖ్యంగా చెండుమల్లె పూలు, తురక చామంతి పూలు, గన్నేరు పూలు అమ్మకూడదన్నారు. ఈ వేలంపాటలో హిందూ మతస్తులు మాత్రమే అర్హులన్నారు. ఆసక్తిగల వారు వేలం పాటలో పాల్గొని దేవస్థాన అభివృద్ధికి తోడ్పడాలని వారు కోరారు.

## 70 కుటుంబాలకు చికెన్ పంపిణీ

**ప్రజాశక్తి - ముద్దనూరు**

ఎన్‌డిఎ కూటమి గెలిచిన సందర్భంగా జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి, నియోజకవర్గ టిడిపి నాయకులు భూపేష్‌రెడ్డి ఆధ్వర్యంలో పట్టణానికి చెందిన టిడిపి నాయకులు చెర్లోపల్లి శ్రీకాంత్ బాబు, గరుడాచలం ఆది ఆధ్వర్యంలో బుధవారం స్థానిక కొత్తకొట్టాల వీధిలోని 70 కుటుంబాలకు కిలో చొప్పున చికెన్, అల్లం, కొత్తిమీర పంపిణీ చేశారు. కార్యక్రమంలో బాబు, భాస్కర్, హేమంత్, హరి, రమేష్ పాల్గొన్నారు.

చికెన్ పంపిణీ చేస్తున్న శ్రీకాంత్, ఆది

# పంట కాలువలోకి చేరుతున్న వ్యర్థ నీరు

**ప్రజాశక్తి - చాపాడు**

మండల పరిధిలోని సిద్ధారెడ్డిపల్లి పంచాయతీలోని ద్వారకానగరం వద్ద పంట కాలువలోకి నీరు వచ్చి చేరుతోంది. గ్రామ సమీపంలోని పాలకేంద్రం నుంచి నీరు విడుదలవుతున్నట్లు ప్రజలు పేర్కొంటున్నారు. పాల కేంద్రంలో శుభ్రం చేసిన వ్యర్థ నీటిని బయటకు వదులుతూ ఉండడంతో అవి కాలువలోకి చేరి కెసి కెనాల్ కలుషితమవుతున్నాయి. గ్రామానికి మంచినీటి సరఫరా చేసే బోరు సమీపంలోకి ఈ నీరు వచ్చి చేరుతోంది. అంతేకాకుండా గ్రామంలోకి నీరు వచ్చే పైపులైను ఈ మార్గాన్నే అందుబాటులో ఉంది. దీంతో నీరు ఎక్కడ కలుషితం అవుతుందో అని ప్రజలు హడలిపోతున్నారు. అంతేకాకుండా వ్యర్థ నీటి వల్ల దుర్వాసన వస్తోంది. ఈ మార్గంలో ప్రయాణించే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు మురుగునీరు పంట కాలువలోకి వదలకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఫ్యాక్టరీ నుంచి విడుదల చేసిన నీటిలో దుర్వాసన అధికంగా వస్తుండడంతో రోగాలు ప్రబలే అవకాశం ఉందని గ్రామస్తులు హడలిపోతున్నారు.

కాలువలో నిలిచిన వ్యర్థ నీరు

# అన్ని మండలాల్లో వైసిపికే మెజార్టీ

**ప్రజాశక్తి - పులివెందుల టౌన్**

2024 సార్వత్రిక ఎన్నికల్లో పులివెందుల అసెంబ్లీ పరిధిలోని ప్రతి మండలంలోనూ వైసిపికే మెజారిటీ వచ్చింది. 1,86,833 ఓట్లు పోల్ కాగా వైసిపి అభ్యర్థి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి 1,16,315 ఓట్లు వచ్చాయి. టిడిపి అభ్యర్థి మారెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డికి 54,628 ఓట్లు వచ్చాయి. వైసిపి అభ్యర్థి జగన్మోహన్‌రెడ్డి 61,687 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. మండలాల వారీగా పరిశీలిస్తే.. సింహాద్రిపురం మండలంలో 22,496 ఓట్లు పోల్ కాగా 13,768 వైసిపికి, 6,143 టిడిపికి వచ్చాయి. 7,434 వైసిపికి మెజార్టీ వచ్చింది. లింగాలలో 21,243 ఓట్లు పోల్‌కాగా, 13,679 ఓట్లు వైసిపికి, 4,613 ఓట్లు టిడిపికి వచ్చాయి. 9,216 ఓట్లు వైసిపికి మెజార్టీ వచ్చింది. పులివెందులలో 49,759 ఓట్లు పోల్ కాగా.. 32,954 ఓట్లు వైసిపికి, 11,940 ఓట్లు టిడిపికి వచ్చాయి. 21,014 ఓట్లు వైసిపికి మెజారిటీ వచ్చింది. వేముల పరిధిలో 19,375 ఓట్లు పోల్ కాగా.. 11,074 ఓట్లు వైసిపికి, 6,390 ఓట్లు టిడిపికి వచ్చాయి. 4,684 ఓట్లు వైసిపికి మెజారిటీ వచ్చింది. తొండూరులో 16,553 ఓట్లు పోల్ కాగా.. 9,389 ఓట్లు వైసిపికి, 5,789 ఓట్లు టిడిపికి వచ్చాయి. 3,600 ఓట్ల మెజారిటీ వైసిపికి వచ్చింది. వేంపల్లిలో 35,558 ఓట్లు పోల్ కాగా.. 21,016 ఓట్లు వైసిపికి, 10,751 ఓట్లు టిడిపికి వచ్చాయి. 10,624 ఓట్లు మెజారిటీ వైసిపికి వచ్చింది. చక్రాయపేటలో 21,601 ఓట్లు పోల్ కాగా.. 12,356 వైసిపికి, 7,683 టిడిపికిరాగా, 4,673 మెజారిటీ వైసిపికి వచ్చింది. పోస్టల్ బ్యాలెట్‌లో 427 వైసిపికి, 212 టిడిపికి రాగా, 215 ఓట్ల మెజారిటీ వైసికికి దక్కింది.

### వేంపల్లెలో వైసిపికి తగ్గిన మెజార్టీ

**వేంపల్లె :** 2024 సాధారణ ఎన్నికల్లో మండలంలో వైసిపికి మెజారిటీ తగ్గింది. మండల వ్యాప్తంగా 46,079 ఓట్లు ఉండగా 35,558 ఓట్లు పోల్ అయ్యాయి. మండల వ్యాప్తంగా 17 గ్రామ పంచాయతీలు ఉండగా 64 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. వీటిలో వేంపల్లె పంచాయతీ పరిధిలో 35 పోలింగ్ బూత్‌లను అధికారులు ఏర్పాటు చేయగా, గ్రామీణ ప్రాంతాల్లో 29 ఏర్పాటు చేశారు. వైసిపికి 21,016 ఓట్లు రాగా టిడిపికి 10,751 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ పార్టీకి 1,763 ఓట్లు వచ్చాయి. వైసిపికి మండల వ్యాప్తంగా 10,265 ఓట్లు మాత్రమే మెజారిటీ వచ్చింది. 2019 సాధారణ ఎన్నికల్లో వేంపల్లె మండలంలో వైసిపికి 13వేల పైచిలుకు మెజార్టీ వచ్చింది. గ్రామీణ ప్రాంతంలో వైసిపికి 4,472 మెజార్టీరాగా వేంపల్లె పంచాయతీ పరిధిలోని 35 బూత్‌ల్లో 5,793 మెజార్టీ వచ్చింది. టిడిపికి గ్రామీణా ప్రాంతాల్లో 4,487 ఓట్లు రాగా వేంపల్లె పంచాయతీ పరిధిలో 6,264 ఓట్లు వచ్చాయి. కాంగ్రెసు పార్టీకి నామమాత్రంగా ఓట్లు వచ్చాయి. వైసిపిలో ఎక్కువ క్యాడర్ ఉన్నప్పటికీ మెజారిటీ మాత్రం తగ్గింది. దీంతో టిడిపిలో జోష్ పెరిగింది.

# ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటాం : టిడిపి

విలేకరులతో మాట్లాడుతున్న మండల పరిశీలకుడు రఘునాథ్‌రెడ్డి

**ప్రజాశక్తి - వేంపల్లె**

టిడిపి కోసం పనిచేసిన ప్రతి కార్యకర్తకూ అన్ని రకాలా అండగా ఉంటామని ఆ పార్టీ మండల పరిశీలకుడు రఘునాథ్‌రెడ్డి తెలిపారు. స్థానిక టిడిపి కార్యాలయంలో పార్టీ మండల కన్వీనర్ రామమునిరెడ్డితో కలిసి మండల పరిశీలకుడు రఘునాథ్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ.. టిడిపి నాయకులు, కార్యకర్తల సమష్టి కృషితో రాష్ట్రంలో టిడిపి అధికారంలోకి వచ్చిందన్నారు. పులివెందుల నియోజకవర్గంలో కూడా టిడిపి మంచి ఓట్ల శాతం సాధించిందన్నారు. ఎన్నికల్లో ఎలాంటి ఒత్తిడికిలోను కాకుండా నిజాయితీగా పని చేయడంతో బిటెక్ రవీంద్రనాథ్‌రెడ్డికి మంచి ఫలితాలు వచ్చినట్లు చెప్పారు. టిడిపి పాలనలో ప్రతి కార్యకర్తకు అన్ని విధాలా అందుబాటులో ఉండి, వారి కష్టాల్లో పాలు పంచుకుంటామన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకొని పార్టీ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఎన్నికల్లో సాయం చేసిన వారందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో టిడిపి నాయకులు భరత్‌రెడ్డి, రవితేజా రెడ్డి, మహమ్మద్ షబ్బీర్, జగన్నాథరెడ్డి, బాలస్వామిరెడ్డి, నిమ్మకాయల మహమ్మద్ దర్బార్, తెలంగాణ వలి, వేమకుమార్, కరీముల్లా, అల్లాబకష్, పీరా సాహెబ్, మహమ్మద్ ఇనాయతుల్లా, డక్కా రమేష్, మడక శ్రీనివాసులు, జబీబుల్లా, రజనీకాంత్ రెడ్డి(సూరి), ముల్లంగి పాపిరెడ్డి, డివి సుబ్బారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వరదను సన్మానిస్తున్న దేవదాసు

## 'వరద' ప్రజామన్ననలు పొందాలి

**ప్రజాశక్తి - ప్రొద్దుటూరు**

ప్రొద్దుటూరు ఎమ్మెల్యేగా 6వసారి అఖండ మెజార్టీతో గెలుపొందిన నంద్యాల వరదరాజులరెడ్డి తన పాలన ద్వారా ప్రజల మన్ననలు పొందాలని ఎస్సీ సెల్ ఆర్గనైజింగ్ మాజీ కార్యదర్శి పబ్బతి దేవదాసు కోరారు. ఎన్నికల్లో గెలుపొందిన సందర్భంగా ఆయన బుధవారం ఎమ్మెల్యే స్వగ్రామమైన రాధానగర్‌లో కలిసి శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా దేవదాసు మాట్లాడుతూ అనుభవంరీత్యా ప్రొద్దుటూరు నియోజకవర్గ ప్రజలకు పెద్దాయనగా గుర్తింపు తెచ్చుకున్న వరదరాజులరెడ్డి అదే తరహాలో పాలన సాగించాలని ఆకాంక్షించారు. అభివృద్ధి, సంక్షేమంతోపాటు ప్రజలు శాంతి యుతంగా జీవించాలని కోరారు. కార్యక్రమంలో మనోహర్, విజయబాబు, సంజీవకుమార్, కమలమ్మ, ముస్కిన్, జ్యోత్స్న, నిర్మల, శీను, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

## వ్యాపారులు రాజకీయాలకు దూరంగా ఉండాలి

**ప్రజాశక్తి - ప్రొద్దుటూరు**

ప్రొద్దుటూరు కూరగాయల మార్కెట్ వ్యాపారులు ఇప్పటికైనా రాజకీయాలకు దూరంగా ఉంటూ తమ జీవనోపాధి కోసం ప్రయత్నించాలని జిల్లా టిడిపి కార్యనిర్వాహకు కార్యదర్శి యస్.పి.మహబూబ్ హుశేన్ బుధవారం ఓ ప్రకటనలో కోరారు. వ్యాపారం జీవనోపాధిగా ఉండాలే తప్ప, రాజకీయం కాకూడదన్నారు. ప్రొద్దుటూరు కూరగాయల మార్కెట్‌లోని చిన్నపెద్ద వ్యాపారులు కొన్నేళ్ల నుండి రాజకీయ నాయకుల మధ్యన చిక్కుకొని యాతన పడుతున్నారన్నారు. వ్యాపారస్తుల్లోనే కొంతమంది రాజకీయ ప్రాపకం కోసమో, స్వప్రయోజనాల కోసమో వేసిన తప్పటడుగుల వల్ల మార్కెట్ వ్యాపారులకు తీరని అన్యాయం జరిగిందని వాపోయారు. ఒకరో ఇద్దరో పెద్ద వ్యాపారస్తులు తప్ప మధ్య, చిన్న వ్యాపారులు ఆర్థికంగా, మానసికంగా కుంగిపోయారని తెలిపారు. సంఘాలని చెప్పి రాజకీయాలు చొప్పించి తమ మనుగడను ప్రశ్నార్థకం చేసుకోవద్దని ఆయన కోరారు.

## వాటర్ ప్లాంట్ కోసం ఘర్షణ

**ప్రజాశక్తి - పులివెందుల రూరల్**

పులివెందుల పట్టణంలోని నగరగుట్ట మంగళ కాలనీ సమీపంలో వాటర్ ప్లాంట్ కోసం టిడిపికి చెందినవారు ఘర్షణ పడ్డారు. నగరిగుట్టలో ఉన్న వాటర్ ప్లాంట్ తనకు కావాలంటే తనకు కావాలని నగరిగుట్ట తెలుగుదేశం పార్టీకి చెందిన వెంకటేష్, శ్రీను ఘర్షణ పడ్డారు. ఘర్షణలో ఇరువురికి గాయాలయ్యాయి. చికిత్స కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

## నేటి నుంచి జనుముల పంపిణీ

**ప్రజాశక్తి - దువ్వూరు**

మండలంలో వరి పంట సాగు చేసే రైతులకు జనము విత్తనాలను సబ్సిడీతో గురువారం నుంచి పంపిణీ చేస్తామని వ్యవసాయ అధికారి అమర్నాథ్‌రెడ్డి తెలిపారు. ఆయా పరిధిలో ఉండే రైతు భరోసా కేంద్రాల వద్దకు రైతులు తమ వెంట పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, సెల్ నెంబరు తప్పనిసరిగా తీసుకెళ్లాలన్నారు. జనుము విత్తన 10 కిలోలు రూ.880 కాగా 50శాతం సబ్సిడీ పోను రూ.440 రైతులు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

## నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

**ప్రజాశక్తి - వేంపల్లె**

ఫెర్టిలైజర్ షాపుల్లో నకిలీ విత్తనాలు విక్రయాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారి రాజేంద్రప్రసాద్ హెచ్చరించారు. బుధవారం వేంపల్లెలోని ఎరువుల దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి స్టాక్ వివరాలను తెలుసుకున్నారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు మాత్రమే విక్రయించాలని సూచించారు. ఎరువులు కొనుగోలు చేసిన ప్రతి రైతుకు బిల్లులు ఇవ్వాలని చెప్పారు. అధిక ధర లకు పురుగుల మందులు, ఎరువులు అమ్మితే కేసులు నమోదు చేస్తామన్నారు. నోటీసు బోర్డులో ధరలను, స్టాక్ వివరాలను పొందుపరచాలన్నారు.

ఎరువుల దుకాణాన్ని పరిశీలిస్తున్న అధికారులు

## 'నల్లారి' గెలుపు హర్షణీయం

**ప్రజాశక్తి-కలికిరి**

పీలేరు నియోజకవర్గంలో టిడిపి నుంచి పోటీ చేసి కిషోర్‌కుమార్‌రెడ్డి గెలుపొందడం హర్షణీయమని టిడిపి యువ నాయకుడు యోగేష్‌రెడ్డి పేర్కొన్నారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన తన తండ్రి సర్పంచ్ రెడ్డివారి ప్రతాప్‌కుమార్‌రెడ్డి సమాధి వద్ద నివాళి అర్పించారు. సార్వత్రిక ఎన్నికలలో పీలేరు కిషోర్‌కుమార్‌రెడ్డి విజయం సాధించడంతో నాయకులు, కార్యకర్తలు, యువతతో భారీ ర్యాలీగా నిర్వహిం చారు. ఎన్నికల సమయంలో పార్టీ గెలుపునకు ప్రచారం చేస్తున్న సమయంలో తన తండ్రి మరణించడం బాధకరమని అన్నారు. కిషోర్‌కుమార్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలిపించుకోవడం తన తండ్రి ఆశయమని అన్నారు. తన తండ్రి ఆశయ సాధన కోసం టిడిపి గెలుపునకు కృషి చేశానని తెలిపారు. మండల ప్రజలకు, టిడిపి నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటానని అన్నారు.

## పిల్లల ఎదుగుదలకే మనోవికాసం

**గాలివీడు :** వేసవి సెలవులలో పిల్లల మనోవికాసాన్ని పెంపొందించుకోవడానికి ప్రతి ఏడాది గ్రంథాలయ శిక్షణ తరగతులు కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని లైబ్రేరియన్ రామచంద్రనాయక్ పేర్కొన్నారు. మే 15 నుంచి ప్రారంభమైన వేసవి శిబిరం ఈనెల 10వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ శిక్షణలో విద్యార్థులకు క్రీడల్లో నైపుణ్యం పొందిన వారికి ఆటలు పోటీలు, క్విజ్ కాంపిటీషన్ నిర్వహించి విజేతలకు బహుమతులు అందిస్తామని చెప్పారు. బుధవారం శిక్షణ తరగతులను తనిఖీ చేసి పిల్లలతో ఆయన ముచ్చటించారు. శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## 'ముక్కా'ను కలిసిన క్షత్రియ నాయకులు

**రైల్వేకోడూరు :** నియోజకవర్గంలోని టిడిపి క్షత్రియ నాయకులు బుధవారం టిడిపి ఇన్‌ఛార్జి ముక్కా రూపానందరెడ్డిని, విజయం సాధించిన జనసేన అభ్యర్థి ఆరవ శ్రీధర్‌ను ముక్కానివాసంలో కలిశారు. క్షత్రియ నాయకులు సూరపరాజు సుబ్బరామరాజు, సంగరాజు రవికుమార్‌రాజు, జి.వెంకటేశ్వరరాజు, డి.కృష్ణంరాజు, జయ చంద్రరాజు, ముద్దులూరు శివరామరాజు, ప్రభాకర్‌రాజు, జయరామరాజు తదితర క్షత్రియ నాయకులు కూటమి బలపరిచిన జనసేన పార్టీ అభ్యర్థి అరవ శ్రీధర్ విజయం సాధించడంతో టిడిపి ఇన్చార్జ్ ముక్క రూపానంద రెడ్డి కలసి పూల మాలలతో ఘనంగా సన్మానించారు.

**IN THE COURT OF THE I ADDL. DISTRICT JUDGE OF CHITTOOR**
**I.A.No. 38 of 2019**
**O.S.No. 103 of 2015**

Between
**K.Krishnamachari and another** ....Petitioners/ Plaintiffs
And
**A.Eswarachari (died) and others** .... Respondents

**NOTICE TO 11TH RESPONDENT**

**To**
**E.Vijayalakshmi,**
D/o Eswarachari, W/o Ramachari
5-89/C, Kolimi Street, Rajampet,
Kadapa District.

**Madam,** Please take notice that the petitioners/plaintiffs have filed the above petition against you and others for sale of the decree schedule mentioned properties as per the preliminary decree dt.21.6.2017 (excluding the plots purchased by the respondents/ defendants 4 to 9). The said IA is posted to **18.6.2024** for your appearance. If you have got any objection you may appear on **18.6.2024 at 10.30 A.M.** either in person or through an Advocate and file your objections. If you fail to do so the matter will be decided ex-parte.

**T.K.SUNDARA KUMAR**
Advocate for Petitioners
Chittoor, Dt.01-06-2024

మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి

## అవినాష్‌కు చెక్ పెట్టి జైలుకు పంపిస్తాం

**ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్**

రానున్న రోజుల్లో వైఎస్ అవినాష్‌రెడ్డికి చెక్ పెట్టి జైలుకు పంపించి భూపేష్‌రెడ్డిని ఎంపీగా గెలిపిస్తానని జమ్మలమడుగు ఎమ్మెల్యే చదిపిరాళ్ల ఆదినారాయణరెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ఆయన మొదటిసారిగా బుధవారం జమ్మలమడుగు పట్టణానికి విచ్చేశారు. ఈ సందర్భంగా కార్యకర్తలు ఆదినారాయణరెడ్డి, భూపేష్ సుబ్బరామిరెడ్డికి పెద్ద ఎత్తున స్వాగతం పలికి అభినందనలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ తన గెలుపునకు ప్రధాన కారణం టిడిపి, జనసేన అన్నారు. కార్యకర్తలు, నాయకులు, ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. జగన్ చేసిన మోసాలను అసెంబ్లీలో నిలదీస్తానన్నారు. కడప జిల్లాలో వైఎస్ కుటుంబం హవా తగ్గిందన్నారు. వివేకానందరెడ్డి హత్య కేసులో అవినాష్‌రెడ్డినే కాకుండా అసలు జంట బయటకు వస్తుందని మరో సంచలన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో అంబేద్కర్ రాజ్యాంగం కాకుండా భారతిరెడ్డి రాజ్యాంగం అమలైందన్నారు. జగన్మోహన్‌రెడ్డి ప్రతి రంగాన్ని దెబ్బ కొట్టారన్నారు. జగన్‌ను అసెంబ్లీలో నిలదీసి వైసిపిని తుంగలో తొక్కేస్తానన్నారు. కడప పార్లమెంటు టిడిపి అభ్యర్థి భూపేష్‌రెడ్డి ఓటమికి ప్రధాన కారణం షర్మిల అన్నారు. ఆమె పులివెందులలో ఓట్లు చీల్చలేకపోయిందన్నారు. నైతికంగా భూపేష్ సుబ్బరామిరెడ్డి గెలిచారని పేర్కొన్నారు. భూపేష్ సుబ్బరామిరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో నైతిక విజయం మాదే అన్నారు. ఇది జిల్లా ప్రజల గెలుపు అన్నారు. కడపలో వారానికి నాలుగు రోజులు ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. స్థానిక సంస్థల్లో మెరుగైన ఫలితాల కోసం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ శివనాథ్‌రెడ్డి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి జంబాపురం రమణారెడ్డి పాల్గొన్నారు

### ప్రభుత్వాస్పత్రికి దేవగుడి ట్రస్ట్ విరాళం

ప్రభుత్వాసుపత్రిలో మా పెత్తనం కోసం కాకుండా ప్రజలకు మేలు జరగాలని ఆస్పత్రి సమస్యలు అడుగుతున్నామని జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిని ఆయన సందర్శించారు. ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రఫీ పాషాను అడిగి సమస్యలను తెలుసుకున్నారు. హాస్పిటల్లో పనిచేస్తున్న డాక్టర్లు, సిబ్బంది, నర్సులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్లు, సిబ్బంది పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. 100 బెడ్ల హాస్పిటల్‌గా మారింది కానీ అమలు కాలేదన్నారు. ఆసుపత్రిలో సిబ్బందిని పెంచాలన్నారు. పలు సమస్యలను విన్న తర్వాత ఎమ్మెల్యే స్పందిస్తూ దేవగుడి శంకర్‌రెడ్డి, సుబ్బరామిరెడ్డి ట్రస్టు ద్వారా ఐదు లక్షలు భూపేష్ సుబ్బరామిరెడ్డి ద్వారా ఇవ్వనున్నట్లు తెలిపారు. భూపేష్ సుబ్బరామిరెడ్డి పర్యవేక్షణలో పని జరగాలని సూచించారు. కార్యక్రమంలో భూపేష్ సుబ్బరామిరెడ్డి, జంబాపురం వెంకటరమణారెడ్డి, డాక్టర్ రఫిక్ బాషా, సుధాకర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ ప్రదీప్ శీను, డాక్టర్లు సిబ్బంది పాల్గొన్నారు.

## సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు

**- పులివెందుల టిడిపి ఇన్‌ఛార్జి బిటెక్ రవి**

**ప్రజాశక్తి - సింహాద్రిపురం**

సార్వత్రిక ఎన్నికల్లో సహకరించిన పులివెందుల నియోజకవర్గ ప్రజలకు, తెలుగుదేశం పార్టీ నాయకులకు, కార్యకర్తలకు శ్రేయోభిలాషులకు ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు అని పులివెందుల టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బీటెక్ రవి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో తమ విజయానికి శక్తికి మించి కృషి చేసినా రాష్ట్రం, ఇతర నియోజకవర్గాల్లో వచ్చిన ఫలితాలు పులివెందులలో రాలేదన్నారు. ఈ విషయం చాలా బాధిస్తోందన్నారు. జగన్‌రెడ్డి పాలన పట్ల రాష్ట్రమంతటా వ్యతిరేక పవనాలు చూపించినా ఇక్కడ జగన్‌రెడ్డినే ఎన్నుకున్నారని తెలిపారు. పులివెందులలో టిడిపి జెండా ఎగురుతుందో ఆనాడే తనకు తృప్తి, సంతృప్తి అన్నారు. రాబోయే రోజుల్లో మీ అందరి సహకారంతో పులివెందుల ప్రజల్లో సైతం మార్పు తెస్తామన్నారు. పులివెందులలో కుడా టిడిపి జెండా ఎగురవేస్తాం అనే నమ్మకం మాకుందన్నారు. జగన్ రెడ్డి మెజారిటీని 30 వేలు తగ్గించిన మీ అందరికీ ధన్యవాదాలు తెలుపుతున్నట్లు రవి పేర్కొన్నారు.

## ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటాం

**- తోట మహేశ్వర్‌రెడ్డి**

**ప్రజాశక్తి - ప్రొద్దుటూరు(పుట్టపర్తి సర్కిల్)**

ప్రొద్దుటూరు టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా నంద్యాల వరదరాజులరెడ్డిని ప్రజలు అత్యధిక మెజారిటీతో గెలిపించారని, ప్రత్యేకించి రాజుపాలెం మండల ప్రజలు టిడిపికి మెజారిటీ సాధించి పెట్టటం తమకు ఎంతగానో సంతోషంగా ఉందని మాజీ జెడ్పిటిసి మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. స్థానిక నెహ్రూ రోడ్డులోని టిడిపి కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ విజయానికి కారణమైన నాయకులు, కార్యకర్తలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తాము నాయకులకు, కార్యకర్తలకు, ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ గ్రామాభివృద్ధికి కృషి చేస్తామని వాగ్దానం చేశారు. అనంతరం టిడిపి నాయకులు కొర్రపాడు రామచంద్రారెడ్డి, అరకటవేముల కృష్ణారెడ్డి, బూతూరు వెంకటరామిరెడ్డి మాట్లాడారు.

## 10 నుంచి పంచమ వేద మహాభారత యజ్ఞం

**గాలివీడు :** శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఈనెల 10 నుంచి 19వ తేదీ వరకు తృతీయ పంచమ వేద మహాభారత యజ్ఞాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పెద్దరాజా పేర్కొన్నారు. తిరుపతి గాన కోకిల జి.వరలక్ష్మి ఆధ్వర్యంలో హరికథ కాలక్షేపం, హార్మోనిస్ పార్థసారథి తబలా వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ప్రతి ఏడాది మండలంలో మహా భారత యజ్ఞాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సోమవారం సర్ప యాగం, మంగళ వారం భీష్మ ప్రతిజ్ఞ, బుధవారం కర్ణ జననం, గురువారం గురుపాండవ జననం, శని వారం ద్రౌపతి కల్యాణం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నాగార్జున నాయుడు ఆధ్వర్యంలో సౌండ్ సిస్టంను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.

**మహారాజశ్రీ ఆళ్లగడ్డ 5వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో**
A.S.No. 29/2022

1) చౌడురు పుల్లయ్య,
S/o. లేట్ పార్వతీశం, వయస్సు 65 సం॥ హిందూ, వ్యవసాయం, H.No. 2/35, చిన్నమకానం వీధి, చాగలమర్రి గ్రామం & మండలం నంద్యాల జిల్లా (కర్నూలు జిల్లా) వగైరాలు
.... అప్పలెంట్స్

V/S

1) చౌడురు పద్మావతమ్మ, W/o. లేట్ వెంకటనారాయణ, వయస్సు 60 సం॥ హిందూ, H.No. 26-923-14 మిట్టకాడి వీధి, ప్రొద్దుటూరు (టౌన్) మరియు మండలం, కడప జిల్లా.
2) చౌడురు శ్రీదేవి, D/o లేట్ వెంకటనారాయణ, వయస్సు 40 సం॥, హిందూ, H.No. 26-923-14, మిట్టకాడి వీధి, ప్రొద్దుటూరు టౌన్ & మండలం, కడప జిల్లా.
3) చౌడురు పవన్ కుమార్, S/o లేట్ వెంకటనారాయణ, వయస్సు 35 సం॥, హిందూ, H.No. 26-923-14, మిట్టకాడి వీధి, ప్రొద్దుటూరు టౌన్ & మండలం, కడప జిల్లా.
.....4,5,6 వ రెస్పాండెంట్స్

**4 ,5, 6 వ రెస్పాండెంట్స్ అప్పీలు నోటీసులు**

అప్పలెంట్స్, రెస్పాండెంట్స్ అయిన మీపై O.S. No. 1/2012 డిక్రీ మీద అప్పీలు కోరి అప్పిలు దాఖలు చేసి ఉన్నందున సదరు అప్పీలు మీయొక్క హాజరు నిమిత్తం 21-06-2024 వ తేదీన ఉదయం 10:30 గంటలకు పై కోర్టులో మీరు స్వయంగా గాని మీ వకీలు ద్వారా కానీ హాజరై ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల మీకు పరోక్షమున అప్పీలు తీర్మానించేదరు.

**(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)**

**వాయిదా : 21-06-2024**

బి. నీలకంఠేశ్వరం,
కె. వెంకటేశ్వర్లు,
అప్పలెన్స్ తరపు అడ్వకేట్స్,
ఆళ్లగడ్డ.